ఆన్‌లైన్ పెట్టుబడిపేరుతో మోసం..

రూ.74.36లక్షలు కోల్పోయిన నగరవాసి

ఇద్దరు సైబర్ నేరగాళ్లు అరెస్ట్

సిటీబ్యూరో, జూన్ 21(నమస్తే తెలంగాణ): ఆన్‌లైన్లో పెట్టుబడులు పెట్టించి..అత్యధికంగా లాభాలు పొందవచ్చనే ఆశచూపి నగరవాసి నుంచి రూ.74.36లక్షలు కొట్టేసిన మహారాష్ట్రకు చెందిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. టోలీచౌకికి చెందిన వ్యక్తి(65).. తనను ఆన్‌లైన్ పెట్టుబడి పేరుతో మోసం చేశారంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనను కొంతమంది వాట్సప్‌లో సంప్రదించి అబాట్ వెల్త్ మేనేజ్‌మెంట్ పేరుతో ఫేక్ ట్రేడింగ్ యాప్‌ను పంపించారని, ఆ యాప్‌లో మనీ డిపాజిట్ చేస్తే పెట్టుబడి మీద అత్యధిక లాభాలు వస్తాయని చెప్పి నమ్మించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక అప్లికేషన్ ద్వారా ఇన్వెస్ట్‌మెంట్ చేయించి లాభాలు వస్తాయని చెప్పడంతో వారిమాటలు నమ్మి.. వారు సూచించిన యాప్ ద్వారా రూ.74,36,157 పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. కొన్నిరోజుల తర్వాత లాభాలు రాకపోగా.. వారు చెప్పిన యాప్ బ్లాక్ అయిందని, నేరగాళ్లను సంప్రదించాలని చూసినప్పటికీ దొరకలేదని తెలిపారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి మహారాష్ట్ర పూనెకు చెందిన రుషికేష్ జయవంత్ కాంబ్లీ, సోహెల్ అహ్మద్ సుల్తాన్‌షేక్‌లను అరెస్ట్ చేశారు. వీరిద్దరూ తమ పేరుతోనే కాకుండా వేర్వేరు పేర్లతో బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేసి అధిక లాభాల పేరుతో అమాయకులను మోసం చేశారు. ఈ ఇద్దరిపై దేశవ్యాప్తంగా 38 కేసులున్నాయని, తెలంగాణలో మూడు కేసులున్నాయని డీసీపీ కవిత తెలిపారు. ఏసీపీ శివ మారుతి ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్ దిలీప్, ఎస్ఐలు ప్రకాశ్, ప్రసేన్ రెడ్డి, కానిస్టేబుళ్లు భాస్కర్, మనీశ్ తివారి, పరశురామ్, రాకేశ్‌కుమార్, గజేశ్వర్, రుక్మిణియాదవ్, అనుషలను డీసీపీ అభినందించారు.



అంతర్జాతీయ యోగా దినోత్సవం..

సిటీబ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. 'ద ఆర్ట్ ఆఫ్ లివింగ్' ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన యోగా దినోత్సవంలో పోలీసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉదయం 6:30 గంటలకు ప్రారంభమైన యోగాలో 350 మంది పోలీసు సిబ్బంది హాజరయ్యారు. యోగా సెషన్‌లో శ్వాస సంబంధిత వ్యాయామాలు, ధ్యానం, వివిధ ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ జాయింట్ సీపీ డా. గజరావు భూపాల్ మాట్లాడుతూ .. ఈ సంవత్సరం 'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్' అనే థీమ్‌తో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, అదనపు డీసీపీ షమీర్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాలంటీర్లు శ్రీనివాస న్, వెంకట్, శ్వేత, శ్రవణ్, హోంగార్డుల ఇన్‌చార్జి ఏసీపీ ఇంద్రవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బౌటర్‌పై రోడ్డు ప్రమాదం: డ్రైవర్ మృతి

కీసర, జూన్ 21: ఔటర్ రింగ్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి చెందారు. ఈ సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం..శనివారం శామీర్‌పేట్ నుంచి కీసర ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా యాద్గార్‌పల్లి ఫ్లైఓవర్‌కు దగ్గరలో ఒక కంటైనర్ లారీ అతి వేగంగా వస్తూ ముందున్న డీసీఎంను ఢీకొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో నల్గొండ జిల్లా మర్రిగూడ మండలానికి చెందిన డ్రైవర్ యాచారం శ్రీరాములు (60)కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108లో గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి చెందాడు.

బ్రేకప్ చెప్పిన తర్వాత కూడా వేధింపులు

బంజారాహిల్స్, జూన్ 21: బ్రేకప్ చెప్పిన తర్వాత కూడా యువతిని వేధిస్తున్న యువకుడిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని ఓ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న యువతి(25)కి ఇన్‌స్టాగ్రామ్‌లో 2019లో భద్రాచలం ప్రాంతానికి చెందిన రత్నాకర్(25) అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. వారిద్దరి మధ్యన పరిచయం ప్రేమగా మారింది. అనంతరం వారిద్దరి మధ్యన విభేదాలు రావడంతో బ్రేకప్ చెప్పుకున్నారు. బ్రేకప్ తర్వాత కూడా యువతికి ఫోన్లు చేస్తూ రత్నాకర్ వేధిస్తున్నాడు. దీంతో బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడు రత్నాకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

స్కూల్ బస్సు ఢీకొని బాలుడు మృతి

జైషన్ (ఫైల్ ఫోటో)

జగద్గిరిగుట్ట, జూన్ 21: స్కూల్ బస్సు ఢీకొని బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరసింహ వివరాల మేరకు.. జగద్గిరిగుట్ట శిరిడీహిల్స్‌లో నివాసముండే ముఖేశ్ చౌహాన్ ఏసీ మెకానిక్. ఇతని కుమారుడు జైషన్ (10) నాలుగో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి సైకిల్‌పై వెళ్తూ తులసీనగర్ చౌరస్తాకు చేరుకున్నాడు. రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ప్రైవేటు స్కూల్ బస్ ఢీకొంది. తీవ్ర గాయాలైన బాలుడిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్‌లో చైన్ స్నాచింగ్

మేడ్చల్, జూన్ 21: మహిళ మెడలో నుంచి మంగళ సూత్రాన్ని దుండగులు లాక్కెళ్లారు. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌కు చెందిన చాకలి సుశీల కండ్లకోయ సమీపంలోని రింగ్‌రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న కళాశాలలో పని చేసున్నారు. శనివారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో సర్వీస్ రోడ్డు మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా స్కూటీపై వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో నుంచి మంగళసూత్రాన్ని లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.6లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత

సిటీ బ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): కుషాయిగూడ కట్టెల మండీ అగ్ని ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబ సభ్యులకు రూ.6లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అందజేశారు. మేయర్ తన పుట్టినరోజు సందర్భంగా శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యుడు రేట్నేని చెన్నయ్యకు చెక్కును అందజేశారు. కాగా 2023 ఏప్రిల్ 16న కుషాయిగూడ కట్టెల మండిలో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా మంటలు ఎగసిపడి పక్కనే సాయినగర్ కాలనీకి వ్యాపించడంతో అక్కడ నివాసం ఉంటున్న సుమ, ఆమె కుమారుడు రేట్నేని జోషిత్ మరణించారు.

చేయూత అభినందనీయం

మన్సూరాబాద్, జూన్ 21: 'ది అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్' ద్వారా అడ్వకేట్స్ కుటుంబాలకు చేయూతనివ్వడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. నాగోల్ శుభం కన్వెన్షన్ హాల్లో శనివారం నిర్వహించిన 'ది అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, హైదరాబాద్' 14వ వార్షిక మీట్-2025 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అడ్వకేట్స్ సొసైటీ అనతి కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా 13 బ్రాంచీలు ఏర్పాటుచేసి 7వేల మందిని సభ్యులుగా చేర్చుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్ర హైకోర్టు జడ్జిలు జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి, జస్టిస్ నర్సింగ్ నందికొండ మాట్లాడుతూ.. అడ్వకేట్స్ కుటుంబాలకు సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలను రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు విస్తరించాలని సూచించారు. అనంతరం అతిథులకు సొసైటీ సభ్యులు జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు శ్రీనాథ్ పిల్లరిశెట్టి, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ మణికొండ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని

అక్కాచెల్లెళ్ల బలవన్మరణం

బడంగ్‌పేట్, జూన్ 21: ఇష్టానుసారంగా తిరగవద్దు, మంచిగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించగా మనస్తాపం చెందిన అక్కాచెల్లెళ్లు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ సుధాకర్ కథనం ప్రకారం.. ఏపీ, నెల్లూరు జిల్లా, ఉదయగిరి గ్రామానికి చెందిన వెంకటేశ్, రమణమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. ప్రస్తుతం బాలాపూర్ మండలం, మల్లాపూర్‌లో నివాసం ఉంటున్నారు. పెద్ద కూతురు వినీల (17) ఇంటర్ సెకండియర్, అఖిల (15) ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నారు. గతంలో వెంకటేశ్ బెంగళూరులో పనిచేయగా.. బాలాపూర్ మండలంలోని రక్షణ శాఖలో కాంట్రాక్ట్ వర్క్ రాగా మూడు నెలల కిందట ఇక్కడికి వచ్చారు. కాగా.. ఇద్దరు కూతుళ్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో తల్లిదండ్రులు కొన్ని రోజులుగా నచ్చజెబుతూ వచ్చారు. పెద్ద కూతురు వినీల.. మూడు నెలల క్రితం ఓ యువకుడిని ప్రేమించి ఇంట్లో నుంచి వెళ్లిపోగా.. ఒప్పించి తీసుకొచ్చారు. కులాంతర వివాహం వద్దు అని తల్లిదండ్రులు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఇష్టానుసారంగా తిరగవద్దు.. మంచిగా చదువు కోవాలని ఇద్దరు కూతుళ్లకు చెబుతూ వచ్చారు. అయినా వారిలో మార్పురాకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో వారిద్దరు మనస్తాపం చెందారు. ఈ క్రమంలో శనివారం తండ్రి ఆర్‌సీఐకి , తల్లి కిరాణా షాపుకు వెళ్లింది. దీంతో మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో అక్కా చెల్లెళ్లు వెంటిలేటర్స్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తల్లి షాపు నుంచి వచ్చి తలుపుకొట్టగా ఎంతకీ తీయలేదు. దీంతో స్థానికుల సహాయంతో చూడగా చనిపోయి ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కూతుళ్లు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

మందుతాగి పట్టుబడిన స్కూల్ బస్సు డ్రైవర్

బంజారాహిల్స్,జూన్ 21: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఓబుల్ రెడ్డి స్కూల్‌కు చెందిన బస్సు డ్రైవర్ మద్యం సేవించి పట్టుబడ్డాడు. శనివారం మధ్యాహ్నం స్కూల్ పిల్లలతో వెళ్తున్న బస్సును ఆపిన ట్రాఫిక్ పోలీసులు డ్రైవర్ నాగిరెడ్డి(60)కి బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా 153 బీఏసీ పాయింట్లుగా తేలింది. దీంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు,

నిండా ముంచిన ఏపీ ఇన్‌ఫ్రా

భారీ రాబడి పేరుతో 50 కోట్ల టోకరా.. బిచాణా ఎత్తేసిన ఏపీ ఇన్‌ఫ్రా సంస్థ

మాదాపూర్ నుంచి ఈఓడబ్ల్యూ ఠాణాకు కేసు బదిలీ

సిటీబ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): తమ సంస్థలో పెట్టుబడులు పెడితే 50శాతం రెట్టింపు రాబడి చెల్లిస్తామంటూ అమాయక ప్రజలను నమ్మించి, వారి వద్ద నుంచి సుమారు రూ.50కోట్లకు పైగా వసూలు చేసి, బిచాణా ఎత్తేసిన ఏపీ ఇన్‌ఫ్రా సంస్థ చైర్మన్ విజయ్ గోగులపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని ఈఓడబ్ల్యూ ఠాణాకు బదిలీ చేశారు. విషయం తెలుసుకున్న మరికొందరు బాధితులు ఈవోడబ్ల్యూ ఠాణాకు చేరుకుని ఏపీ ఇన్‌ఫ్రాపై ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే...నగరానికి చెందిన విజయ్ గోగుల మరో 10మందితో కలిసి ఆరేళ్ల క్రితం ఏపీ ఇన్‌ఫ్రా పేరుతో మాదాపూర్‌లో ఒక సంస్థను ప్రారంభించాడు. ఫ్రీ లాంచింగ్, అధిక రాబడి, తదితర ఆశలు చూపి పెద్ద ఎత్తున జనాలను ఆకర్షించాడు. ఈ క్రమంలో తమ సంస్థ పెద్ద ఎత్తున వెంచర్లు చేస్తోందని, యాదగిరిగుట్ట, నారాయణఖేడ్, బుదేరా, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వెంచర్లపై పెట్టుబడులు పెడితే, పెట్టిన పెట్టుబడిపై ఏడాది కాలంలోనే 50శాతం రాబడి చెల్లిస్తామని నమ్మబలికారు. దీంతో దాదాపు 200మందికి పైగా బాధితులు లక్షలు, కోట్లలో పెట్టుబడులు పెట్టారు. ప్రారంభంలో కొంతమందికి రాబడి చెల్లించడంతో అది చూసిన మరికొంత మంది ఆకర్షితులై పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టారు. ఈ క్రమంలో కోట్ల రూపాయలు వసూలు చేసిన విజయ్ గోగుల ముఠా గత సంవత్సరం బిచాణ ఎత్తేసింది. దీంతో గత సంవత్సరం నవంబర్‌లో శ్వేత, రఘు అనే బాధితులు మాదాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా పెద్ద సంఖ్యలో బాధితులు ఉండడమే కాకుండా కోట్ల రూపాయల మోసం జరిగినట్లు తేలింది. దీంతో కేసును ఈఓడబ్ల్యూ ఠాణాకు బదిలీ చేశారు. విషయం తెలుసుకున్న మరికొంత మంది బాధితులు శుక్రవారం పెద్ద ఎత్తున ఈఓడబ్ల్యూ ఠాణాకు చేరుకుని నిందితుడిని వెంటనే అరెస్టు చేసి, తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

హర్యానా నుంచి మద్యం రవాణా..

ఇద్దరు అరెస్ట్.. 15 లక్షల విలువైన ఎన్‌డీపీ మద్యం పట్టివేత

సిటీబ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): హర్యానా రాష్ట్రం నుంచి నగరానికి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.15లక్షల విలువ చేసే 18 రెడ్ లేబుల్, 13 బ్లాక్ లేబుల్, ఒక జేమ్స్, రెండు శివాజీ రీగల్ మద్యం కార్టన్‌లతో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. మెదక్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ కథనం ప్రకారం... సామల నవీన్ కుమార్, ఎదులావత్ టికియా నాయక్‌లు హర్యానా రాష్ట్రంలో మద్యం కొనుగోలుచేసి నగరంలో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో వారిద్దరు కారులో మద్యం తీసుకువస్తున్నారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ తన సిబ్బందితో కలిసి ముత్తంగి టోల్ ప్లాజా వద్ద వారి కారును తనిఖీ చేయగా.. హర్యానా రాష్ట్రానికి చెందిన నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. వారిద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.15లక్షల విలువైన ఎన్‌డీపీ మద్యంతో పాటు కారు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ఈ కేసుతో సంబంధం ఉన్న కత్తులావత్ రవీందర్ నాయక్‌తో పాటు మరో ఇద్దరిపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఆబ్కారీ పోలీసులు తెలిపారు. ఎన్‌డీపీఎల్ మద్యాన్ని పట్టుకున్న సీఐ పరమేశ్వర్‌గౌడ్, ఎస్ఐ రాములు, అనంతరెడ్డి, మణెమ్మ, కె.శ్రీనివాసరావుల బృందాన్ని ఆబ్కారీ ఈడీ షానవాజ్ ఖాసిమ్ అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ, జూన్ 21: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ విద్యాసంవత్సరం నుంచి డిజైన్ విభాగంలో సృజనాత్మక కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కోర్సుల సమన్వయకర్త హేమంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 4 సంవత్సరాల డిగ్రీ కోర్సులో ఫ్యాషన్ డిజైన్, విజువల్ కమ్యునికేషన్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్ కోర్సులకు సంబంధించి ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు , యానిమేషన్, వీఎఫ్ఎక్స్, ఫొటోగ్రఫీ సర్టిఫికెట్ కోర్సులు సాయంత్రం 4 నుంచి 7గంటల వరకు కొనసాగుతాయన్నారు.

పర్యావరణ పోటీలకు..

అమీర్‌పేట్ : తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్పస్ ఆధ్వర్యంలో జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీలు-2025 జరగనున్నాయి. పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరిచందన ఆవిష్కరించారు. 1వ తరగతి నుంచి మొదలు యూజీ, పీజీ, రీసెర్చ్ స్కాలర్స్ స్థాయి వరకు జరిగే ఈ పోటీలు ఐదు విభాగాల్లో కొనసాగనున్నా యి. ప్లాంటింగ్ ట్రీస్, సెగ్రిగేషన్ వేస్ట్, కన్జర్వింగ్ వాటర్ అంశాలపై జరిగే ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

వసూల్‌రాజాలపై వేటు

- మహంకాళి పీఎస్‌లో ముగ్గురు ఖాకీలు సస్పెన్షన్
- సిటీలో మరో 13 మందిపై అంతర్గత విచారణ
- వసూళ్లకు పాల్పడితే సహించేది లేదు
- సీపీ సీవీ ఆనంద్

సిటీబ్యూరో/బేగంపేట, జూన్ 18(నమస్తే తెలంగాణ): ఓ వ్యాపారిని హవాలా డబ్బులు ఉన్నాయంటూ బెదిరించి.. కేసు లేకుండా చేసేందుకు డబ్బులు తీసుకున్న వ్యవహారంలో మహంకాళి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేశారు. కడప నుంచి ఓ వజ్రాల వ్యాపారి నగదు తీసుకుని వెళ్తుండగా శ్యామ్, మహేశ్ అనే ఇద్దరు కానిస్టేబుళ్లు అతనిని మహంకాళి పీఎస్ పరిధిలో పట్టుకున్నారు. అతని దగ్గర ఉన్న నగదు హవాలాది అంటూ బెదిరించారు. డీఐ కేసరి ప్రసాద్‌కు సమాచారమిచ్చి అతను చెప్పినట్లుగా ఆ వ్యాపారిని బెదిరించి సెటిల్‌మెంట్‌కు ఒప్పించారు. ఆరు లక్షలు ఇస్తే కేసు లేకుండా చేస్తామని డీల్ కుదుర్చుకున్నారు. దీంతో ఆ వ్యాపారి తన అకౌంట్ నుంచి వారి ఖాతాకు నేరుగా 6 లక్షల రూపాయలు ట్రాన్స్‌ఫర్ చేశారు. డబ్బుల నుంచి వారు 50వేలు వాడుకున్నారు. అయితే తన అకౌంట్ నుంచి ట్రాన్స్‌ఫర్ చేసిన రసీదులతో సహా తనను డబ్బులు డిమాండ్ చేసిన వారిపై ఆ వ్యాపారి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ఈ వ్యవహారంలో డీఐ కేసరి ప్రసాద్, శ్యామ్, మహేశ్‌లపై సస్పెన్షన్ వేటు వేశారు. గతంలో ఈ ఇన్‌స్పెక్టర్ పనిచేసిన దగ్గర కూడా ఇలాంటి వివాదాలే ఉన్నాయని తెలిసింది.

ఇటీవల నాంపల్లి వద్ద పెద్ద ఎత్తున బంగారం పట్టుకున్న వ్యవహారంలో పోలీసులు మధ్యవర్తితో బేరసారాలు సాగించారు. చార్మినార్ పరిసర ప్రాంతాల నుంచి నాంపల్లి మీదుగా బంగారాన్ని తీసుకెళ్తున్న సమయంలో ఇంత బంగారమెక్కడిదంటూ పోలీసులు అతనిని ఆపి ప్రశ్నించారు. బంగారం స్వాధీనం చేసుకుని మధ్యవర్తిని నానా తిప్పలు పెట్టారు. ఆనోటా ఈనోటా బయటపడడంతో మధ్యవర్తిని పిలిచి ఏం జరగలేదని చెప్పాలంటూ బెదిరించినట్లు తెలిసింది. చివరకు ఈ విషయంపై ఎక్కడా బయట పడకుండా రూ. 20లక్షల్లో సెటిల్ చేసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆ ప్రాంత ఉన్నతాధికారి స్థాయిలో ఎంక్వైరీ జరిగినా కింది స్థాయి అధికారులు మాత్రం తాము పట్టుకున్న బంగారం విషయంలో తగ్గేదే లేదంటూ ఫైనల్ సెటిల్‌మెంట్‌లో పని కానిచ్చేశారని పోలీసు వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది.

కొత్తగా బాధ్యతలు తీసుకున్న చోటే..!

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పలు పోలీస్‌స్టేషన్లలో పనిచేసే సిబ్బందిపై ఉన్నతాధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. నెల కిందటే ట్రాన్స్‌ఫర్లయి వచ్చినప్పటికీ కొంత మంది తమ పాత పోలీస్‌స్టేషన్లలో చేసిన దందాలకు సంబంధించి ఇంకా లావాదేవీలు నడుపుతున్నారంటూ ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌ల్లో పనిచేస్తున్న 13 మంది ఇన్‌స్పెక్టర్లపై అంతర్గతంగా విచారణ జరుగుతున్నట్లు సమాచారం. మహంకాళి పీఎస్‌కు ఇటీవలే చిక్కడపల్లి నుంచి బదిలీ అయి వచ్చిన డీఐ వచ్చీ రావడంతోనే తన కింది స్థాయి సిబ్బందితో కలిసి డబ్బుల దందా మొదలుపెట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాత బస్తీలోనూ ఇదే తరహాలో ఒక ఇన్‌స్పెక్టర్ తన వద్దకు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయకుండా ఎస్ఐ ద్వారా సెటిల్‌మెంట్ చేసుకోవాలంటూ ఫిర్యాదుదారులకు సూచించినట్లు తెలిసింది. ఈ విషయంలో కూడా ఉన్నతాధికారులు సీరియస్ అవుతున్నారు. ఇక సౌత్ జోన్ పరిధిలోని ఒక పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఒక చీటింగ్‌కు సంబంధించిన వ్యవహారంలో తమకు న్యాయం చేయాలంటూ బాధితులు వస్తే వారి వద్ద నుంచి పర్సంటేజీ మాట్లాడుకుని వారు ఒప్పుకోకపోతే మోసగాడితో కుమ్మక్కయ్యారంటూ ఒక ఇన్‌స్పెక్టర్‌పై ఆరోపణలు వచ్చాయి. అదే జోన్‌కు చెందిన మరో కొత్త ఇన్‌స్పెక్టర్ చార్జ్ తీసుకున్న తర్వాత తన దగ్గర పనిచేసిన పాత వారి ద్వారా లోకల్‌లో జరిగే వ్యాపారాలు, వాటి నుంచి వచ్చే మామూళ్లపై వివరాలు తీసుకుని ఆ వ్యాపారులకు తమ మామూళ్లు తమకు సరిగ్గా అందాలంటూ హుకుం జారీ చేశారని.. అయితే ఈ వ్యవహారం ఉన్నతాధికారి వరకు చేరడంతో ఆయన అతనిని పిలిచి మందలించినట్లు తెలిసింది. కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో అక్రమ దందాలు జరిగితే సహించేది లేదని, ఫిర్యాదుదారులను వేధించినా సెటిల్‌మెంట్లకు పాల్పడినా కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

జ్యోతిష్యం

★మీ ఇంట్లో ఏవైనా సమస్యలా? వెంటనే మాతాజీని కలవండి... లేదా సంప్రదించండి... 100% మీ సమస్యలు పరిష్కరింపబడతాయి... నమ్మకంతో రండి. మా సర్వీసెస్: ప్రేమవివాదాలు, భార్యాభర్తల వివాదాలు, అత్తాకోడళ్ల గొడవలు, వ్యాపార సంబంధిత గొడవలు లేక నష్టాలు, భూవివాదాలు, కోర్టుకేసులు, శత్రువులచే నష్టపోవడం లేదా ప్రయోగం చేయబడటంవల్ల బాధపడుతున్నారా? చేతబడి ప్రభావంవల్ల మీకు నష్టం కలుగుతుందా? ఇలాంటి ఎన్నో సమస్యలకు మా వద్ద పరిష్కారం దొరుకుతుంది (శాశ్వత నిర్మూల